

ఉపోద్ఘాతం :

రవి. బి ఎస్‌సి చివరి సంవత్సరం చదువుతూ వున్నాడు. సన్నగా బారుగా తిన్నగా తీరుగా వుంటాడు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు ఎవర్నీ పలకరించడు. ఎప్పుడయినా ఎవరో పలకరిస్తే గోళ్ళు గిల్లుకుంటూ, తల వంచుకొని తల వూపుతాడు. ఎవరికి అయినా ఎదురుపోతే ఏమయినా పలకరిస్తారేమోనని తప్పుకు తప్పుకు తిరుగుతాడు.

అతను లేకుండా పుస్తకాలు వుంటాయికానీ పుస్తకాలు లేకుండా అతనుండటంలేదు ఆంగ్ల గ్రంథాలంటే అతనికి అమితమయిన అభిమానం. అతను రూంలో వుండక

పోతే లైబ్రరీలో వుంటాడు క్లాసులో మంచి మార్కులు వచ్చే కొద్దిమందిలో అతను ఒకడు. అతనికి కళలంటే కాస్తో కూస్తో అభిమానం కూడా వుంది.

అప్పుడెప్పుడో కథలు కొన్ని గిలికి ఏవేవో పత్రికలకు పంపితే ఎకాఎకి తిరుగు టపాలో తిరిగి వచ్చాయి. కథలు వ్రాయటం కోసం కలం పట్టలేదు అయితే పెనిసిలు పట్టుకున్నాడు బొమ్మలు గీశాడు. కుంచెముట్టుకున్నాడు, రంగులు వేశాడు. అయితే అవి తనకే తృప్తి కలిగించక పోవటంతో ఎక్కడికీ ప్రచురణకు పంపకుండా చేతులు-కాదు కాళ్ళతో కొన్ని పనులు చేయాలనుకొని ఎవరూ లేని సమయంచూచి ఏకాంతంగా తనగదిలో డాన్సు చేయటం మొదలు పెట్టి, అద్దం ఎగతాళిగా వెక్కిరిస్తూవుంటే అదేం లాభం లేదని విరమించుకొని నోటితో ఏదో తతంగం చేయాలను

కొలకలూరి

కున్నాడు. ఎప్పుడయినా కూనిరాగం తీయాలి అని అభిప్రాయం కలిగితే పక్కరూంలో వుండేవాళ్ళు పాట విని ఆనందించలేక కేసుపెట్టి కోర్టుకు లాగి అభాసు చేస్తారని వాళ్ళకి కష్టం కలక్కుండా వుండేందుకు బీచ్‌లోకి పోయి జనానికి దూరంగా కూర్చుని తాపీగా కంఠం విప్పి సాఫీగా పాడుతూవుంటే పీతలు నిక్కిచూచి కన్నాల్లో దాక్కుంటూ వుంటాయి.

రవి సంగతి సందర్భాలు అర్థంచేసుకున్న విద్యార్థులు 'అమ్మాయి' అంటూ వుండేవాళ్లు. ఎప్పుడూ పుస్తకాలతో ఎడం ఎడంగా తిరగటం చూచిన అమ్మాయిలు అతన్ని 'పుస్తకాల పురుగు' అనటం ప్రారంభించారు ఆ రెండు మాటలూ ఆనోటా ఆనోటా పడి అలా అలా సాగి వచ్చి అతని చెవిలో చొరబడ్డాయి. ఆ క్షణంనుంచి అతనిలో విప్లవం వచ్చింది. మహామహావాళ్ళకంటే యమా విప్లవకారుడుగా తయారయిపోయాడు.

రాణి రవి క్లాసుమేటు. ఎర్రగా రీవిగా ఏపుగా నిండుగా వుంటుంది. బట్టలు కట్టుకోవటంలో క్రొత్తక్రొత్త పద్ధతులు ఆమె కనిపెడుతూ వుంటుంది గొప్ప చిత్రకారుడుగా పేరుపొందిన వ్యక్తి ఆమె అవయవ నిర్మాణం చూచి చిత్తరపోయి, మాటా పలుకూ లేకుండా ప్రమాన్పడి పోయాడట! రెండు జడలూ రెండు కళ్లూ ఆమె నడుస్తుంటె తిరిగి తిరగటం చూడాలేకాని...అని విద్యార్థుల అభిప్రాయం.

ఆమె చుట్టూ ఆడపిల్లల జట్టు ఒకటి ఎప్పుడూ వుంటుంది అందరూ అల్లరిలో ఆరితేరిన ఘటాలు. ఆమె ఎప్పుడూ వసపిట్టలాగా మాట్లాడుతూ వుంటుంది. క్లాసులో పాఠం వినదు. మిగతావాళ్ళని విననివ్వదు. ఆమెకు అల్లరే లేకపోయి నట్లయితే కాలేజీ బ్యూటీగా చెలామణి అయివుండేది. అయితే ఆమె అప్రాయం తెచ్చుకోని అల్లరి అమ్మాయి.

ఆటపాటలంటే ఆమెకు అంతులేనంత ఆసక్తి. ఆటలు బాగా ఆడగలగటం వల్లనే ఆమె అమ్మాయిల్లో ఛాంపియన్ అయింది పాఠాలు వినకపోయినా మార్కులు బాగా వస్తూ వుంటాయి. ఆమె విద్యార్థినులలో లీడరు, అన్ని విషయాలలోనూ.

రాణి పాటలు బాగా పాడగలదు. సంగీతం అభ్యసించిందని చెప్పుకుంటూ వుంటారు. శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం రెండూ జోడిస్తే రాగమూ, తాళమూ, లయా తప్పని ఒక క్రొత్త సృష్టి జరుగుతుంది అంటుంది. కోకిల కంఠం విప్పినట్టు, వన్నెల మయూరం లాగా పురి విప్పినట్టు, పూల సౌందర్యం లాగా కులుకుతూ ప్రవహించినట్లు, ఆమె పాడుతుంది నటరాజు ఆనందించేట్టుగా నృత్యం చేస్తుందిట! అయితే ఆమె

నృత్యం చేయటం ఎవరూ చూడలేదు. ఎప్పుడూ ఏ విచారమూ లేకుండా అల్లరి వల్ల ఆనందం పొందుతూ సంతోషంగా వుంటుంది రాణి.

అంతరాంతర్యం :

ఎక్స్‌పెర్‌మెంట్ నెంబర్ ఎన్ - పరిచయాలు.

అమ్మాయిల అనురాగాన్ని, అభిమానాన్ని సంపాదించాలీ అంటే అందుకు అనుగుణంగా అమ్మాయిలకు అత్యంత ఆదరణీయమూ, అభిలషణీయమూ అయిన పద్ధతులు అలవర్చుకోవటం విధి. రాణి అందానికి సాటిలేదు. ఈ విషయం చాలామందికి తెలుసు. అయితే చాలా కాలం అయిపోయిం తర్వాత అర్ధరాత్రి వేళ చదువుకుంటూ అకస్మాత్తుగా ఒక తీర్మానం చేశాడు రవి ఏకగ్రీవంగా, 'రాణి అందంగా వుంటుందీ' అని. రెండోరోజు కాలేజీలో చాలా ప్రయత్నంచేసి బలవత్తర పరిస్థితుల్లో చివరికి ఆమె వినేట్టుగా ప్రకటించాడు అమూల్యాభిప్రాయాన్ని. రాణి వింది. వెనక్కు చూచింది. నవ్వింది. రవి ఎగిరి పూలమీద దూకి జరజరా దొర్లిపోయాడు.

అప్పటినుంచి రాణికి ఒక విషయం తెలిసిపోయింది. తెలివితేటలు ఉన్నవాడూ, అందచందాలు కలిగిన వాడూ, అయిన రవికి తన సౌందర్యం తెలిసినందుకు అంతులేనంత ఆనందంలో మునిగి ఊపిరి ఆడక తన్నుకులాడింది.

"నాన్న జేబులో డబ్బులుతీసి వత్తులపెట్లో దాచావు కదమ్మా. అవి నేను తీసుకొని ఈ బొమ్మ కొనుక్కున్నాను."

అయితే అతను కనిపించినప్పుడల్లా అమ్మాయిలు అల్లకల్లోలంగా నవ్వుతూ వుండేవాళ్ళు 'గోలచేస్తున్నారా బాబూ ఇదెక్కడి గొడవ కొనినెత్తికి తెచ్చుకున్నాను' అని దిగులుపడేవాడు. రవి ఒంటరిగా కనిపించినప్పుడల్లా 'పుస్తకాల పురుగు' అంటూ వుండేది రాణి. కొంత కాలానికి అతను పుస్తకాలు బరువు బరువుగా మోయటం మానుకొని ఒక్క నోట్సుతో కాలేజీకి వస్తూవుండేవాడు. ఆడపిల్లలు ఎవరూ లేనప్పుడు లైబ్రరీకి పోయేవాడు పుస్తకాలు రూంకి తీసుకుపోయి చదువుకునేవాడు. ఇలా జరుగుతూ

వుంటే రాణి పుస్తకాల పురుగు అనటం మానుకుంది.

ఎక్స్‌పెరిమెంట్ నెంబర్ టూ - సాహస కృత్యాలు :

రాణికి సైకిల్ త్రొక్కటం అంటే ఇష్టం అని రవి తెలుసుకున్నాడు అప్పటి నుంచి ప్రయత్నాలు సాగించాడు. ఇంటికి ఉత్తరం రాసి డబ్బు తెప్పించి సైకిల్ కొని ఎక్స్‌పర్ట్‌ని దగ్గర పెట్టుకొని సైకిల్ నేర్చుకొనటం ప్రారంభించాడు. మూడు రోజులు నిర్విరామంగా ప్రయత్నం చేసి రోడ్డుమీదికి వచ్చాడు. తీరా రోడ్డుమీద జనాన్ని చూచి, కదిలిపోతున్న బళ్ళూ, కార్లూ, సైకిళ్ళూ చూచి, నిలువెల్ల నీరు గారిపోయి, మనిషంతా వణికిపోయి, కాళ్ళుచేతులూ ఆడక, చల్లబడి, నిదానంగా రోడ్డుమీద బోర్లాపడి లేచి సైకిల్ నడుపుకొని రూంకు వెళ్ళాడు.

సైకిల్ త్రొక్కటం తనవల్ల తేలదేమో నని ఒక అనుమానం చిన్న సైజులో కలిగింది. అందువల్ల ప్రయత్నం పెరిగింది. ఎప్పుడూ జనం వుండని పామ్ రోడ్డున తిరిగాడు ఆపైన బీచ్ రోడ్డున కొద్దిగా జనం వుండేచోట సైకిల్ నడిపాడు. ఆతర్వాత గవర్నరు బిల్డింగు ప్రాంతంలో తొక్కాడు ఇక కురుపాం మార్కెట్టు ప్రాంతంలో బాగా జనం ఉండేచోట విజయవంతంగా సైకిల్ అభ్యాసం పూర్తి చేశాడు. ఇక అప్పటినుంచి జనాన్ని తప్పుకోవటం, సమయానికి బెల్ కొట్టటం, సడన్‌గా బ్రేక్ వేయటం అతనికి ఇట్టే అలవాటయి పోవటంతో రోడ్డుమీద యధేచ్ఛగా తిరుగుతున్నాడు.

ఒక శుభ ముహూర్తం చూచి కాలేజీలోకి సైకిల్ నడుపుతూ వచ్చాడు ఆ సమయంలో రాణీ ఆమె జట్టు వస్తున్నారు వాళ్ళు చూడటంకూడా జరుగుతుందని రవి ఆనందించాడు. అయితే సైకిల్ వెళ్ళిపోవటానికి వాళ్ళే అడ్డంగా నడుస్తున్నారు ఏమిటి చేయటం ? బెల్ కొట్టాడు. వాళ్ళు తప్పుకోలేదు. వెను తిరిగి చూడలేదు. బ్రేకులు వేశాడు వాళ్ళు మరీ మెల్లగా నడుస్తున్నారు. సైకిల్ దిగి నడిపించుకొని పోదామనుకున్నాడు. అయితే తను సైకిల్ త్రొక్కుతున్నట్టు రాణి ఎప్పుడు చూస్తుంది ? కాబట్టి సైకిల్ త్రొక్కాల్సిందే అనుకున్నాడు. వాళ్ళను తప్పించుకొని ముందుకు పోతే వాళ్ళు చూస్తారు. ఎలా అయితే ఏం ముందుకు పోయి నేను సైకిల్ త్రొక్కుతున్నాను చూడండహో అన్నట్టుగా వెనక్కు చూశాడు. అదే క్షణంలో అప్పటిదాకా లేకుండా అప్పుడే వచ్చిన సైకిల్‌ని గమనించలేక అమ్మాయిల వైపే చూస్తూ వస్తున్న యువకుడెవరో సైకిల్ దగ్గరగా వచ్చిందాకా రవి చూడలేదు సైకిల్ పడింది ఇద్దరూ పడ్డారు రవి పైకి లేస్తున్నప్పుడు అమ్మాయిల నవ్వులు పకపకా వినిపించాయి

రాణికూడా మెలికలు తిరుగుతూ నవ్వుతూ వెళుతూవుంది. రవి పరాభవం పొందాడు. ఎంతో ఆశించాడు ఇలా అయింది ఈ పరాభవానికి షైన్ వేసు కోవాలి చెంపదెబ్బ కొట్టుకోబోయి ఆగి, రూంకిపోయి, ఏడుస్తూ పర్సులో వున్న పైకంలోంచి పది రూపాయిల కాగితం పైల్లో పెట్టాడు.

ఛాంపియన్ రాణికి ట్రాక్ అండ్ ఫీల్డు ఈవెంట్స్‌లో రన్నింగ్ రేస్ అంటే చాలా ఇంటరెస్టు రవి రన్నింగు ప్రాక్టీస్ చేయాలని భావించాడు. గేమ్సుకి హాజరవుతూ వుండేవాడు ఫీల్డుకి వెళుతూ వుండేవాడు. పరుగెత్తటానికి అవసర మయిన మూమెంట్స్ పి.డి చేత నేర్పించుకున్నాడు వేగం రావటంలేదు కాని పద్ధతులు అలవడుతూ వున్నాయి కృషి సాగిస్తూ వున్నాడు.

ప్రాక్టీస్‌వల్ల ఫలితం వుందని గ్రహిం చాడు. బాగా ఆకలి అవుతూ వుంది. అన్నం చాలా ఎక్కువగా తింటున్నాడు ప్రైజ్ తీసుకోగలిగే స్థితి రావాలి మూడు నెలల తరువాత అతనూ ఒక ఎథలెట్‌గా చెలామణి అయిపోయాడు చాలా ప్రయిజులు వచ్చాయి ఈ మూడు నెలలలో బరువు చాలా పెరిగాడు ఎత్తు కూడ కొంచెం పెరిగాడు. అందంగా కూడా వుంటున్నాడని వాళ్ళూ వీళ్ళూ అంటున్నారు

అతని ప్రయత్నం నెరవేరి ప్రైజ్ తీసుకుంటున్నప్పుడు రాణి చూడలేదు సరికదా, ఆప్రాంతంలోనే లేదు. ఎంతో నిరాశ కలిగింది. నిస్పృహతో నిద్ర పోయాడు.

తెల్లవారింది. హోటల్లో రాణితో ఆమె క్లాసుమేటు రవి ప్రైజ్ విషయం చెబుతూవుంది దూరంనుంచి వాళ్ళకు కనిపించకుండా ఆనందంతో పొంగిపోతూ రవి వింటూ వున్నాడు. అయితే రాణి నాలుక చప్పరించింది జరిగిపోయిన సంగతి చెబుతూవుంటే రవి వినలేక పోయాడు. ఆమె ఇలా చెప్పింది.

"అప్పుడు రవి రన్నింగ్ రేస్ ప్రాక్టీస్ చేస్తున్నాడు కన్ను మూసినా తెరిచినా అదే ఆలోచన వస్తూవుండేది. ఒకరోజు రాత్రి రెండు గంటలదాకా చదువుకొని అకస్మాత్తుగా పరుగు అభ్యా సం గుర్తుకువచ్చి, రూంలోంచి బయలు దేరి రోడ్డుమీద పరుగెత్తటం ప్రారంభిం చాడు. కాపలా పోలీస్ అనుమానంతో విజిల్ వేశాడు. అయినా రవి ఆగకుండా ఏకబిగిని పరుగుపెడుతున్నాడు క్ష ణ క్షణానికి వేగం పెంచుతూ అప్పుడు ఇద్దరు పోలీసులు కలిసి అయ్యగారిని పట్టుకొని చక్కగా పోలీస్ స్టేషనుకు తీసుకుపోయి ఆ రాత్రంతా దోమలూ, నల్లులూ, ఉమ్ములూ, చీకటి మధ్య పోలీస్ స్టేషన్లో కష్టడీలో వుంచారు" అని ముగించింది అమ్మాయిలంతా

విపరీతంగా నవ్వారు సూదులుతో పొడిచి నట్లు బాధపడి లేచి రూంకిపోయి పర్సులో వున్న పైకంలోంచి పది రూపాయిల కాగితం తీసి ఫైల్లో పెట్టాడు

బట్టలు కట్టుకోవటంలో నేర్పువల్ల అందం రెట్టింపు అవుతుందని రాణి ఋజువు చేస్తుంది. తనుకూడా ఆ నేర్పు అలవర్చుకోవా లనుకున్నాడు రవి ముందువెనుకలు ప్రపోర్షనేట్‌గా షర్టు సద్దుకొని టక్ చేసుకోవటం రవికి తెలుసు. అప్పుడప్పుడూ అవసరమయిన అకేషన్స్‌లో కోటు వేసుకోవటం, టై గాని, బౌ గాని కట్టుకోవటం కుదురు తుంది. మునుపు ఒకసారి పైజమా వేసుకున్నాడు అయితే పంచె కట్టుకోవటం తెలియదు ధోవతీ కట్టుకొని, లాల్చీ తొడుక్కుంటే చాలా బాగా వుంటుందని భావించాడు బజారుకి వెళ్ళి అంతా సిద్ధం చేసుకున్నాడు

ధోవతీ ధరించటం తెలిసిన స్నేహితుడ్ని రూంకి తీసుకొనివచ్చి, నేర్పించుకున్నాడు. తరవాత స్వతంత్రంగా ప్రయత్నించాడు. పంచె నడుంమీద నిలవటంలేదు. అందువల్ల ముడి వేశాడు ముడి వూడి వూరుకుంటూంది అది కుదరటంలేదని బెల్టు బెట్టాడు అయితే పల్చని లాల్చీలోంచి బెల్టు కనబడుతూ వుంది. బెల్టు తీసి పంచె కొనలు మెలి పెట్టి నడుం పక్కనుంచి దోపి చూశాడు బిర్రుగా వుంటి. వెరీగుడ్ అనుకున్నాడు. శాండో బనియన్ వెసుకున్నాడు. క్లాసు లోకి వెళ్ళాడు అమ్మాయిలు చూశారు రాణి సంతోషంగా నవ్వుకుంటూవుంది.

క్లాసు అయిపోయింది. అమ్మాయిల కంటే ముందు లేచి గబగబా వాళ్ళ ముందు నడచి వెళుతున్నాడు ముంజెంగు మోకాలిమీద అడ్డంతగులుతూ వుంది. ఆపైన బొటన వ్రేలిమీద జీరాడుతూ చెప్పుకి అడ్డం పడుతూవుంది తప్పుకొని నడుస్తున్నాడు. వెనుక రాణి జట్టు వుంది. ఉన్నట్టుండి దోవతి చెంగు బొటన వ్రేలుకి తగిలి గోచి వూడిపోయింది పంచె లుంగీ లాగా తయారయింది

రాణి కులికి కులికి నవ్వుతూవుంది. ఆ నవ్వు ప్రతిధ్వనించేంత పెద్దదిగా వినబడుతూవుంది. సంతోషం ఎగిరిపోయింది కోపం, దుఃఖం ముంచుకొని వచ్చింది. ప్రక్కరూంలోకి పోయి గోచి పెట్టుకున్నాడు పరాజయం పొందినంత బాధపడ్డాడు. ఏడ్పు ముఖంతో రూంకి పోయాడు పర్సులో వున్న పైకంలోంచి పది రూపాయిల కాగితం తీసి ఫైల్లో పెట్టాడు

ఎక్స్‌పెరిమెంటు నెంబరు త్రీ - తంత్రజ్ఞత.

ఒకరోజు సాయంకాలం కాలేజీ అయిపోయిం తరవాత హాస్టలుకి వెళుతున్నాడు రవి సైకిల్ ఎక్కి స్నేహితుడు వచ్చి తననికూడా తీసుకొని పొమ్మని అడిగాడు. అలాగేనని రవి ఒప్పుకు

న్నాడు. ఇద్దరూ సైకిల్‌మీద వెళుతున్నారు. రోడ్డుమీద రాణీ ఆవిడ జట్టు నడుస్తున్నారు జల్సాగా ధీమాగా వెళుతున్నాడు రవి. రాణి చూచింది

'మిష్టర్ రవీ!' రాణి పిలిచింది

'ఏమిటీ?' అన్నాడు రవి సైకిల్ ఆపి

'ఇలారండి' అంది.

ఏదో మేలు జరుగబోతూందని రవి హుషారుగా స్నేహితుడికి సైకిల్ ఇచ్చి దగ్గరకు పోయాడు

'మీకు ట్రాఫిక్ రూల్సు తెలుసా?'

'ఏమి టవి?' ముఖం తెల్లబడింది రవి వళ్ళంతా చెమటపట్టింది బట్టలు తడిసిపోతున్నాయి అందుకు కారణం అమ్మాయి మాట్లాడటం ఒకటి భయంగా వుండటం రెండు చెప్పుతీసుకొని చెంప మీద కొట్టినట్లుగావుంది

అయినా వీరోచితంగా 'అయితే ఏం' అంటూ సైకిల్ ఎక్కబోయాడు

'పోలీసుని పిలవమంటారా' అంటూ ముందుకు చూచింది కార్నర్ లో పోలీసు వున్నాడు

రవికి మాటలు రాలేదు సైకిల్ ఎక్కలేదు ఇద్దరూ కలిసి నడక ప్రారంభించారు

రాణి జట్టు గొల్లుమని నవ్వింది

రవి అల్లాడిపోయాడు. నవ్వులు దాణ్ళలాగా వీపుకి తగులుతూ వున్నాయి

"ఇదిగో చూడు బ్రదర్, పరీక్ష పోతే పోయిందిలే విచారించకు. వచ్చే సంవత్సరం గెటాన్ కావచ్చులే."

"నే నందుకు విచారించటంలేదులేవోయ్. నేను, జలజ ఒకే క్లాసులో కూచునే ఉద్దేశ్యంతో ఫెయిలవుతే ఆ అమ్మాయికూడా ఫెయిలయింది ఖర్మ."

దిగులుతో రూంకి పోయి, పర్సులో వున్న పైకంలోంచి పది రూపాయల కాగితం తీసి ఫైల్లో పెట్టాడు

* * *

నాలుగు రోజులు గడచిపోయాయి మ్యాట్నీ చూచి రాణీ, ఆవిడ స్నేహితురాలూ ఇద్దరూ ఒకే రిక్షా ఎక్కి వస్తున్నారు రవి చూశాడు

'మిస్ రాణీ' పిలిచాడు

'ఏమిటీ?' పలికింది

'మీకు ట్రాఫిక్ రూల్సు తెలుసా?' అడిగాడు రిక్షా ఆగింది

'తెలియదు' చెప్పింది

'ఇద్దరు వ్యక్తులు ఒక రిక్షా ఎక్కకూడదు' చెప్పాడు

'అహఁ మహా చెప్పొచ్చారు ఆ రూల్ ఇంతకుముందు వుండేది ఇప్పుడదేమీ లేదు. పట్టణంలో జనభా పెరగటంతో ఆ రూలు మారింది. క్రొత్తరూలు అమలులోకి వచ్చింది. తెలియకపోతే తెలియనట్లు వూరుకోవాలి కాని తెలిసినట్లు చెప్పకూడదు. పాపం శ్రమపడ్డారు. వెళ్ళిరండి' అంది

రవి మాట్లాడలేకపోయాడు. అయినా ఎక్కువ సేపు మాట్లాడులేదు వెళుతున్నాడు.

'మిష్టర్ రవీ' రాణి పిలిచింది

'ఏమిటీ ?' అంటూ అటూ ఇటూ చూశాడు ఎక్కడ పోలీసులు లేరు

'ఇలా రండి' అంది.

'ఏమిటీ ?' దగ్గరకు పోయాడు

'క్రొత్త రూల్ ఎమీ లేదు. నువ్వు ఏదో చెప్పబోతూవుంటే అలా అన్నాను' జవాబు చెప్పింది

'అయితే దిగటం మంచివాళ్ళు చేసే పని' అలా మాట్లాడగలిగినందుకు ఎంతో సంతోషించాడు

'అదేం కుదరదు' అంటూ రిక్షా వాడితో 'పోనీయ్' అంది

'అయితే మంచివాళ్ళు కాదన్నమాట'

'కాదు' రాణి పకపకా నవ్వింది

రిక్షా మళ్ళీ ఆగింది

'మిష్టర్ రవీ' పిలిచింది

రవి పోలేదు.

రాణి దగ్గరగా వచ్చింది.

రవి వెళితే రాణి వచ్చేదికాదు రవి వెళ్ళలేదు కాబట్టి రాణి దగ్గరకు వచ్చింది. ఆడవాళ్ళ లక్షణమే అంత !

రిక్షావాడికి డబ్బులిచ్చి పంపింది.

'నీమీద జాలి తలచి రిక్షా దిగి నడిచి వెళుతున్నాం కాని నువ్వు ఏవో రూల్స్ చెప్పావని మాత్రం కాదు ' అంటూ రాణి వెళ్ళిపోయింది స్నేహితురాలితో, నవ్వుతూ

రవికి పుట్టెడు దుఃఖం వచ్చింది, చిరాగ్గా రూంలోకి పోయి వలవలా విలపించాడు. పర్సులోవున్న పైకంలోంచి పది రూపాయిల కాగితాలు రెండు తీసి పర్సులో పెట్టాడు

ఎక్స్‌పెర్‌మెంటు నెంబర్ ఫోర్ - దయా దాక్షిణ్యాలు:

రాణి కొాక తమ్ముడున్నాడు. అతని పేరు మధు. ప్రీ యూనివర్సిటీ చదువుతున్నాడు. అతనికి ఆరోగ్యం బాగా లేకపోవటంవల్ల హాస్పటల్లో చేరాడు అతన్ని చూడటం కోసం రోజూ సాయంకాలం అక్కడికి వెళుతుంది రాణి. పరిచర్య చేస్తుంది. ఈ విషయం తెలుసుకున్నాడు రవి తక్షణం రూంకి వెళ్ళాడు

ఆరోగ్యంగా వున్న రవి ఆరోగ్యంగా వున్న రెండు ఉల్లిపాయల్ని చితకగొట్టి అనారోగ్యంగా చేసి అనారోగ్యంగా

వుండటానికి చంకల్లో పెట్టుకున్నాడు. అరగంట తిరక్కముందే నూట నాలుగు డిగ్రీల జ్వరం వచ్చింది.

వెంటనే హాస్పటల్‌కి పోయి డాక్టరుతో మాట్లాడి, మధు బెడ్ ప్రక్కనే బెడ్ వేయించుకున్నాడు. సాయంకాలం అయింది. రాణి వచ్చింది. అప్పటికే రవి జ్వరం తగ్గిపోయింది. బెడ్డుమీదే వున్నాడు. రాణి రవిని చూచింది. చూడనట్లుగా వెళ్ళిపోయింది. మధు దగ్గరకు పోయింది కులాసాగా కబుర్లు చెప్పింది. రవికి చాలా ఆనందంగావుంది. వింటూ పడుకున్నాడు. తనని కూడ పలకరిస్తుందనీ, మందు తాగిస్తుందనీ, కబుర్లు చెబుతుందనీ ఏమేమో వూహించుకుంటూ పడుకున్నాడు.

రాణి డాక్టరు దగ్గరకు పోయింది. మధు ఆరోగ్యం విషయం కనుక్కుంది. తిరిగి వచ్చింది. ఆమె పునరాగమనం కోసం ఎదురుచూస్తూ రవి పడుకునే వున్నాడు. రవిని చూడలేదు. పలకరించలేదు. ఆగలేదు. ఏమీ గమనించనట్టు వెళ్ళిపోయింది. రవి ఆశలన్నీ నిరాశలయిపోయాయి. డాక్టరుతో తన జ్వరం తగ్గిందని చెప్పి, డిస్‌చార్జి చేయించుకొని రూంకి వెళ్ళి, వెక్కివెక్కి ఏడ్చి, నిద్రపోయి, మేలుకొని పర్సులోవున్న పైకం

లోంచి రెండు పదిరూపాయిల కాగితాలు తీసి ఫైల్లో పెట్టాడు.

* * *

ఏ వ్యాపకం లేకుండా నెలరోజులు చదివి రవి బాగా పరీక్షలు వ్రాశాడు. ముందుగా పరీక్షలు అయిపోయిన మధు ఇంటికి వెళ్ళిపోయాడు. ప్రాక్టికల్స్ పూర్తయిం తరవాత వేసవి శలవలకి విద్య పూర్తయిన రాణి బయలుదేరింది. ఆమె ఏ రైలుకి వెళుతుందో రవి తెలుసుకున్నాడు.

వెంటనే బజారుకిపోయి సవాశేరు పచ్చిమిరప కాయలు తెచ్చి, ఒక చక్కని జేబుగుడ్డలో అవి పోసి ఒక రాయి తీసుకొని నలగకొట్టి అది జేబులో పెట్టుకొని రైలు దగ్గరకు పోయాడు.

ఆమె రైలులో కూర్చుని వుంది. అటు వెళ్ళాడు. ఆమె చూడలేదు. దగ్గరకు పోయాడు. ఆమె గమనించలేదు. సూటిగా చూశాడు. ఆమె చూచింది. అయితే మాట్లాడలేదు. బండి కదలబోతూవుంది జేబుగుడ్డ తీసి కంటిపాపలకు తగిలేట్టుగా నులుంకున్నాడు. కళ్ళకు మిరపకాయల సారం ఘాగరు తగులుతూవుంది కళ్ళ వెంట నీళ్ళు తిరుగుతూ వున్నాయి.

'వెళుతున్నావా ?' ప్రశ్నించాడు. కళ్ల వెంట నీళ్లు తిరగటం చూచింది కొంచెం కంకారుపడింది. ఆశ్చర్యపోయింది జాలి తలచింది

'అవును' అని వణుకుతున్న కంఠంతో బాధగా జవాబు చెప్పింది. కర్చీఫు కళ్ళకు తగలనిచ్చాడు. నీళ్ళు కారిపోతూ వున్నాయి. రైలు బైలుదేరింది. ఆమె ఒకసారి చూచి దీర్ఘంగా నిట్టూర్చి వూరుకుంది.

రైలు వెళ్ళిపోయింది. చేతిగుడ్డ అవసరం లేకుండానే రవి కళ్ళలోంచి జలపాతంలాగా వేగంగా కన్నీరు జలజలా రాలింది. రైలు వేగం పెరుగుతున్న కొద్దీ కన్నీరు వేగం పెరిగింది. తూలిపోతూ రూంకి వచ్చాడు. తల పగిలిపోతూ వుంది. పర్సులో వున్న పైకంలోంచి పది రూపాయిల కాగితాలు రెండు తీసి ఫైల్లో పెట్టాడు.

ఉపసంహారం :

రవిలో ఏదో నిర్వికల్పమైన స్థితి ఏర్పడింది. దుఃఖం అంతులేని కడలిలాగా అలలులేస్తూ వుంది గుండెలలో ఏదో కొండల బరువు పెరుగుతూవుంది.

ఫైల్లోవున్న పది రూపాయిల కాగితాలు పది అల్లరిచిల్లరగా అచ్చం రాణిలాగా గాలికి ఎరుగుతూ వున్నాయి.

లేడీస్ హాస్టలు గేటు కీపరు వచ్చి తలుపు తట్టి, పార్శిల్ ఇచ్చి రాణిమ్మగారు ఇమ్మన్నారు అని చెప్పి వెళ్ళిపోయాడు

రవి గబగబా విప్పాడు ఒక ధోవతీ, ఒక లాల్చీ అందులో వున్నాయి. లోపల

ఒక కాగితం వుంది మడుపులతో. మడత విప్పగానే ఒక మల్లె మొగ్గ, మరొక్క ఉంగరం అందులో వున్నాయి ఆ కాగితంలో రాణి చేతివ్రాత స్పష్టంగా కనబడుతూవుంది.

ఉంగరం చాలా విలువైంది.

ఆ ఉత్తరంలో ఒకేఒక్కవాక్యవుంది. అదికూడా ఎంతో పెద్ద వాక్యం కాదు. రెండు మాటలు - 'మల్లెమొగ్గ జాగ్రత్త'.

అతనిలో విద్యుత్తు ప్రవహిస్తూవుంది. వెంటనే ఒక ఆలోచన వచ్చింది. ఫైల్లో వున్న పైకం తీసుకొని బజారుకి పోయి ఉంగరం కొని పోస్టాఫీసుకి పోయి పార్శిల్ చేయబోతూ ఆగి, రూంకి తిరిగి వచ్చాడు.

ధోవతి కట్టుకొని లాల్చీ వేసుకొని, ఉంగరం పెట్టుకొని, జేబుగుడ్డలో మల్లెమొగ్గ, క్రొత్త ఉంగరం జేబులో పెట్టుకొని గది తలుపుకి తాళం వేసి రోడ్డు మీదికి వచ్చాడు.

టాక్సీ తీసుకొని ఎక్కడికి పోవాలో చెప్పాడు. వంద మైళ్లు పోయింతరవాత ఒక జంక్షనులో రాణి ఎక్కి బయలుదేరిన రైలు ఆగివుండటం చూచి రవి టాక్సీ దిగి స్టేషను దాటి రైలు దగ్గరకుపోయి, కంపార్టుమెంటులోకి ఎక్కాడు.

రాణి చూచింది. ఆశ్చర్యపోయింది. నిలువెల్ల తిలకించింది. హాయిగా తల వంచుకొని నవ్వుకుంది.



"నమస్తే, నా పేరు సావిత్రండీ, మీరు. .."
"సత్యవంతుణ్ణిలెండి."

రవి ఎదురుగా వున్న సీటులో కూర్చున్నాడు.

ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు. చాలాకాలం నిశ్శబ్దంగా గడచిపోయింది. ఒకరివైపు ఒకరు చూచుకోలేక పోతున్నారు.

ఉన్నట్టుండి రవి రాణి చేయి పట్టుకున్నాడు. ఆమె భయంతో సంతోషంగా సిగ్గుపడింది.

తను కొని తెచ్చిన ఉంగరం ఆమె చేతికి తొడిగాడు. చక్కగా కుదిరింది.

మల్లెమొగ్గ తీసి జడలో తురిమాడు. ఆమె కళ్ళలోంచి జలజలా బాష్ప బిందువులు జారాయి.

రవి రెండు చేతులూ పట్టుకొని దోసిలి ఏర్పరచి తల దోసెట్లో వుంచింది. ఆమె నుదుట కుంకుమ అతని అరచేతికి తగిలి అక్కడున్న రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ★